క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మూడో వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పరిశీలించారు. కేసీఆర్ కాలనీ, వెంకటేశ్వర్‌రావు కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా తదితర ప్రాంతాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కేసీఆర్ కాలనీలో సీసీ రోడ్లతో పాటు మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉందని చైర్మన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పుట్టి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు

నర్సాపూర్: బీజేపీ నర్సాపూర్ టికెట్ కోసం శనివారం ముగ్గురు నాయకులు దరఖాస్తు చేశారు. పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, పార్టీ నాయకుడు రఘువీరారెడ్డి, నాయకులు, కార్యకర్తలతో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో టికెట్ కోసం దరఖాస్తులను అందజేశారు. దరఖాస్తు చేసిన నాయకుల వెంట పార్టీ నాయకులు సురేశ్, బాల్‌రెడ్డి, రవిగౌడ్, రాజేందర్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ నియోజవర్గ బీజేపీ టికెట్ కోసం బీజేపీ గిరిజన రాష్ట్ర నాయకుడు ధరవాత్ సురేందర్‌నాయక్ హైదరాబాద్‌లో తన అనుచరులతో వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు.

విగ్రహాల ప్రతిష్ఠకు అంకురార్పణ పూజలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు శనివారం అంకురార్పణ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, దేవతా మూర్తుల జలాధివాసం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో భక్తులు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వార్డు మెంబర్లు వెంకటేశ్, సంతోష్, మహేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో హనుమాన్ దేవాలయంలో హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలను గ్రామస్తులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద రాము పంతులు, వేద పండితులు ఆధ్వర్యంలో పుణ్యావచనం, పంచగవ్వ స్థాపన, యాగశాల ప్రవేశం, జలాదివాసం తదితర పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాషబోయిన చంద్రశేఖర్ దంపతులు, సర్పంచ్ ప్రభావతి, ఉప సర్పంచ్ ధర్మేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బసవేశ్వర్



ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఎన్నుకుంటున్న దృశ్యం

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో శనివారం గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా గోండ్ల బసవేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కర్నేకోటి రాములు, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి శివకుమార్, కోశాధికారిగా బిక్కనూరి నవీన్, సహాయ కార్యదర్శిగా వసంరాజు, గౌరవ అధ్యక్షుడిగా పుట్టి దుర్గయ్య, సభ్యులుగా పల్లె వెంకయ్య, బోయిని లక్ష్మయ్య, గోండ్ల నర్సింలు, గువ్వల రమేశ్ వడ్డేపల్లి గంగారం, గువ్వల వెంకటేశం, బోయిన సతీశ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

వివాహిత అదృశ్యం



ఫిర్దాస్‌బేగం (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: వివాహిత మహిళ కనిపించకుండా పోయిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెదక్ పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గోల్కొండ వీధికి చెందిన 33 ఏళ్ల ఫిర్దాస్‌బేగం భర్త షఫీయొద్దీన్‌తో గొడవపడి ఈనెల 3న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని భర్త తెలిపారు. ఆమె ఇంటి నుంచి వెళ్లినప్పుడు బ్లూ కలర్ పంజాబీ డ్రెస్ ధరించి ఉన్నట్లు చెప్పారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి



హైదరాబాద్‌లో సీడీఎంఏ కమిషనర్ పమేల సత్పతికి ఫిర్యాదు పత్రం అందిస్తున్న నాయకులు

సీడీఎంఏకు దళిత సంఘాల ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ దుకాణాల విషయంలో అక్రమార్కులకు సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ జానకీరాంపై చర్యలు తీసుకొని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ యువజన జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో సీడీఎంఏ కమిషనర్ పమేల సత్పతికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై బాల్‌రాజ్ మాట్లాడుతూ.. మున్సిపల్ దుకాణాలు టెండర్లు వేస్తామని చెప్పి నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి డీడీలు కట్టించుకొని ఆరు నెలలు కావస్తున్నా.. టెండర్లు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దుకాణాల్లో బినామిలతో కుమ్మక్కై అటు మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. మరోవైపు అప్పులు చేసి, డీడీలు కట్టిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీలు డబ్బులు రాక, దుకాణాలు కేటాయించక పోవడంతో పడరాని పాట్లు పడుతున్నారని వాపోయారు. మున్సిపల్‌కు సంబంధించి 15 దుకాణాలు ఒక్క వ్యాపారి చేతులోనే 40 ఏళ్లుగా ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, ప్రభాకర్, గోపాల్‌నాయక్, నాగరాజు, ఏసు, భాను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఉత్తులూర్‌లో గొర్రెల యూనిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉత్తులూర్‌లో 8, టెంకటి, బుజ్రాన్‌పల్లిలో 8 యూనిట్‌లను సబ్సిడీపై గొర్రెల లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, సర్పంచ్‌లు పార్వతీశంకర్‌గౌడ్, కుంట్ల రాములు, నరేశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, వెటర్నరీ డాక్టర్ నాగార్జున, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, దామోదర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్నయ్య, ఉత్తులూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు దుర్గేశ్ పాల్గొన్నారు.

చాకరిమెట్లలో శ్రావణమాసం సందడి



సామూహిక వ్రతంలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. శ్రావణ మాసం ఆఖరి శనివారం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. ఆంజనేయస్వామితో పాటు సీతారామచంద్రస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది దంపతులు అభిషేకం నిర్వహించి, అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. శివ్వంపేటకు చెందిన దివంగత కొడకంచి సత్యగౌడ్ జ్ఞాపకార్థం వారి కొడుకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన



దేవులపల్లిలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి, ముక్రాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, నాగరాణి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతీరోజు భోజనంలో పాలు, కోడిగుడ్డు ఆకుకూరలు అధికంగా తినాలని చెప్పారు. రక్తహీనతను నివారించుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని, ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మార్కెట్ యార్డ్ ప్రారంభం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గొర్రెలు, మేకల మార్కెట్ యార్డ్‌ను శనివారం ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ ప్రారంభించారు. మండల కేంద్రం వెల్దుర్తిలో ప్రతి శనివారం వారంతపు సంత పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో గ్రామానికి సమీపంలోని ఆరెగూడెంలో జీవాల సంత ఏర్పాటు చేయడం పై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పైప్‌లైన్ బాగు చేయండి



గొప్యతండా వద్ద పగిలిపోయిన భగీరథ పైప్‌లైన్

చిన్నశంకరంపేట(మెదక్): కాళేశ్వరం కాల్వ నిర్మించిన కల్వర్టుతో మిషన్ భగీరథ నీటిసరఫరా పైప్‌లైన్ పగిలిపోయింది. ఇది జరిగి మూడు నెలలైనా.. బాగు చేయడంలేదని మండలంలోని కామారం తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారంత తండా నుంచి గొప్యాతండా, రాజ్యాతండాకు నీటి సరఫరా చేసే పైప్‌లైన్ రోడ్డు వెంట ఏర్పాటు చేశారు. కాళేశ్వరం కాల్వ కోసం ఇటీవల కల్వర్టు పనులు చేపట్టారు. ఈ సమయంలో పైప్‌లైన్ పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై భగీరథ అధికారులకు చెప్పినా ఫలితంలేకపోవడంతో స్థానిక గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి కూడా తీసుకొచ్చారు. కానీ అధికారులు స్పందించలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా వ్యవసాయ పంట పొలాల వద్ద బోరు మోటార్ల నుంచి నీటిని తీసుకొచ్చి వాడుకుంటున్నామని గిరిజనులు తెలిపారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ: కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 వరకు తెలంగాణలో కేవలం రెండు మెడికల్ కళాశాలలు ఉండేవన్నారు. సీఎం కేసీఆర్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మెదక్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ కళాశాలలో 2024లో తరగతులు ప్రారంభం అని ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో ఉన్నప్పటికీ చదవకుండానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

బీఎస్పీకి పెరుగుతున్న ఆదరణ



మందాపూర్‌లో బీఎస్పీ మండల నూతన కార్యవర్గం ఎన్నికైన దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): అందోల్ నియోజకవర్గంలో బీఎస్పీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని పార్టీ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముప్పారం ప్రకాశం చెప్పారు. శనివారం మండల పరిధిలోని మందాపూర్ గ్రామంలో అల్లాదుర్గం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీటీసీ దుర్గయ్య, బీఆర్ఎస్ పార్టీ విద్య కమిటీ చైర్మన్‌లు బీఎస్పీలోకి కండువా కప్పి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలో ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. నూతన కార్యవర్గం అల్లాదుర్గం మండల బీఎస్పీ నూతన కమిటీ అధ్యక్షుడిగా కొలారి రాములు, ఉపాధ్యక్షుడు గంగారం, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, కార్యదర్శి అమృతయ్య, కోశాధికారిగా అశోక్, కార్యవర్గ సభ్యులుగా నరేశ్ నాయక్, మాణయ్య, కృష్ణ, శీను, సాయిలు, నర్సింలు యాదవ్, నర్సింలతో పాటు 20 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వర్షంతో రోడ్డుపై దిగబడ్డ లారీ

● రాకపోకలకు అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండల కేంద్రం నుంచి మిర్జాపల్లి వెళ్లే రోడ్డుపై కల్వర్టు వద్ద లారీ దిగబడింది. శనివారం మండలంలోని మిర్జాపల్లి గ్రామ శివారులో రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద రోడ్డుమట్టిలో లారీ చక్రాలు దిగబడడంతో ఒక వైపు ఒరిగిపోయి తృటిలో ప్రమాదం తప్పింది. జేసీబీ సహాయంతో లారీని లాగేందుకు ప్రయత్నం చేసినా.. ఫలితం లేకపోయింది.

పరిశ్రమలతో ఉపాధి కల్పిస్తున్నాం

మనోహరాబాద్(తూప్రాన్): ఫినోలెక్స్ బేబి ప్రాడక్ట్ పరిశ్రమ ప్రారంభంతో స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నామని పరిశ్రమ ఎండీలు కృష్ణ సింగక్కిడి, హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో ఫినోలెక్స్ పరిశ్రమను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే రూ. 20 కోట్ల బడ్జెట్‌తో చిన్న పిల్లలకు ఉపయోగకరమైన హాని కల్గించని ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసి, వివిధ దేశాలకు సైతం ఇంపోర్ట్ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 250 మందికి ఉపాధి కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ముత్తు, అరుప్‌బెనార్జీ, జానకీ రామన్, నరేశ్‌కమార్, చైతన్య, తదితరులున్నారు.

ప్రమాదకరం.. పట్టించుకునే వారేరి?

బూర్గుపల్లిలో తెగిపడిన విద్యుత్ వైరు.. తప్పిన ప్రమాదం



బూర్గుపల్లిలో తెగిపోయిన విద్యుత్ వైర్

హవేళీఘనపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో సొసైటీ వద్ద ఉన్న వైరు తెగి కింద పడిపోయింది. ఈ వైరు జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ అధికారులు కిందకు వేలాడుతున్న వైర్లను సరి చేయాలని పదే పదే చెబుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కిందకు వేలాడుతున్న వైర్లను సరిచేసి, ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మాట్లాడుతున్న అవార్డు గ్రహీత దత్తాత్రేయ కులకర్ణి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దత్తాత్రేయ కులకర్ణిని శనివారం ఎన్‌డీవై కాలనీలో సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు మాణిక్యం, సభ్యులు నర్సింగరావు, మురళి, వెంకటేశ్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్, మల్లేశ్, భూపతిగౌడ్, నవీన్‌గౌడ్, రమేశ్, బేతయ్య, వినయ్, రమేశ్‌గౌడ్, నరేశ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేట, నిజాంపేట మండలాల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు సిద్ధరాంలు, శ్రీనివాసచారిని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఐరేని రవీందర్‌గౌడ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అల్లాదుర్గం మండల జోనల్ లయన్స్ క్లబ్ అల్లాదుర్గం బాలుర జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ధనుంజయ్యను ఎంపిక చేయగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు పెద్దన్న, మల్లప్ప, వైద్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా అంజుబాబు

రేగోడ్(మెదక్): లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి ఆచార్య దేవోభవ కార్యక్రమం నిజామాబాద్‌లో శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా రేగోడ్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అంజుబాబు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో నవీన్ కుమార్, రాచోటి శివశంకర్, నాగరాజు, అరవింద్ పాల్గొన్నారు.

కాళోజీకి ఘన నివాళి



హవేళీఘనపూర్(మెదక్): కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

జిల్లా వ్యాప్తంగా శనివారం కాళోజీ నారాయణరావు జయంతిని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ యాసను నిజమైన భాషగా నినదించిన ప్రజాకవి కాళోజీని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **అల్లి నరేశ్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డు**

చేగుంట(తూప్రాన్): జీవనమంత్ర యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చేగుంటకు చెందిన అల్లి నరేష్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డును నిజామాబాద్‌లో అందించారు. శనివారం లయన్స్ 320డీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కార్యక్రమం నిర్వహించగా, నరేశ్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బాబూరావు, గవర్నర్ లక్ష్మి ప్రశంస పత్రం అందించి సన్మానించారు. కార్యక్రమంలో చేగుంట లయన్స్ అధ్యక్షులు అనీల్, వీరబ్రహ్మం, రాము, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు**

పాపన్నపేట(మెదక్): మండలంలోని కుర్తివాడ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీసీ కెమెరాలను మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సహకరించిన దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ **దుర్గమ్మను దర్శించుకున్న ముదిరాజ్ నాయకులు**

మెదక్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఆధ్వర్యంలో శనివారం ముదిరాజ్ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వనదుర్గ భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల, ముక్రాజ్‌పల్లి, దేవులపల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్ఎం శిరోమణి, ప్రమీళ, రిబిక, వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరీ, నాగరాణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

◆ **దుర్గా భవానీ ఆలయ వార్షికోత్సవాలు**

కొల్చారం (నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలోని దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

◆ **బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భానుచందర్**

రామాయంపేట(మెదక్): బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధమ్మయ్యగారి భానుచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, విజయ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల కన్వీనర్ దయానందరెడ్డి, పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఓబీసీ మోర్చా రామాయంపేట అధ్యక్షుడు కటిక కార్తీక్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు ఏకనామ స్మరణ**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గూడూర్ గ్రామంలోని గురు పీఠం బాలాలయంలో ఆదివారం ఏకనామ స్మరణ చేస్తున్నట్లు గురుపీఠం ఫౌండర్, చైర్మన్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. పీఠంలో జగద్గురు దత్తాత్రేయ స్వామి, సాయిబాబా ఆలయం, వేద పాఠశాల నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిత్య పూజల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు పండితులు ఏకనామ స్మరణ చేస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

◆ **హాస్టల్ విద్యార్థులకు జ్వరాలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని ఎస్టీ బాలుర హాస్టల్ విద్యార్థులు జ్వరాలతో బాధ పడుతున్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులు చికిత్స చేయించుకున్నారు. హాస్టల్‌లో 180 విద్యార్థులు ఉండగా పలువురికి జ్వరాలు, మరో 20 మందికి జ్వరం, జలుబు, దురదతో ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం మార్పులో భాగంగా విద్యార్థులకు జ్వరం వచ్చిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీహెచ్‌సీ వైద్యురాలు సాయిసౌమ్య చెప్పారు.

◆ **ఓటరు నమోదుపై అవగాహన**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఓటరు నమోదుపై గ్రామస్తులకు అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు శనివారం అవగాహన కల్పించారు. కౌడిపల్లిలో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, బీఎల్‌ఓ సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల, వీఓఏ ఏసు తదితరులు పాల్గొన్నారు.